సాక్షి బాపట్ల
మంగళవారం । 3 । డిసెంబర్ । 2024




హరిహర క్షేత్రంలో కుంకుమార్చనలు

అచ్చంపేట: స్థానిక హరిహర క్షేత్రంలోని గిరిజా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో గౌరీపాడ్యమి సందర్భంగా సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మంగళగిరి: శ్రీ పానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను సోమవారం మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఆలయ ఏసీ ఎ.రామకోటిరెడ్డి పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 587.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,217 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వరికి ముసురు ముప్పు

ఆందోళనలో అన్నదాతలు

- మళ్లీ మొదలైన వాన
- బాపట్లలో వర్షం
- చీరాల, రేపల్లెల్లో చిరు జల్లులు
- వేమూరులో మబ్బులు
- రేపల్లె, వేమూరుల్లో కోత దశలో ఉన్న వరి
- బాపట్లలో పాలు దశలో వరిపంట
- వర్షం కురిస్తే పంట తాలు పోయే పరిస్థితి



ఈదురు గాలులు, చిరుజల్లులతో రేపల్లె ప్రాంతంలో నేలవాలిన వరి పంట

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఫెంగల్ తుపాను ముప్పు తప్పినా సోమవారం నుంచి జిల్లాలో చిరుజల్లులు కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని వేమూరు, రేపల్లె ప్రాంతాల్లో వరి పంట కోత దశలో ఉంది. వేమూరు నియోజకవర్గంలో వారం రోజుల నుంచి కోతలు మొదలు కాగా రేపల్లెలో ఇప్పుడిప్పుడే కోతలు మొదలయ్యాయి. ఫెంగల్ తుపాను ప్రభావంతో మూడు రోజులుగా కురిసిన వర్షానికి చాలా వరకు వరిపంట నేలకొరిగింది. ధాన్యం వర్షం నీటిలో తడిసి రాలిపోయింది. ఆదివారం వర్షం తెరిపిచ్చినా సోమవారం నుంచి తిరిగి మరోమారు జిల్లాలో ముసురు పట్టింది. మబ్బులు అలుముకొని బాపట్లలో ఒక మోస్తరు వర్షం కురవగా రేపల్లె, చీరాల ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. వేమూరులో ఆకాశం మబ్బులతో నిండుకుంది. దానికితోడు ఈదురు గాలులు వీస్తున్నాయి. గాలులకు తోడు వర్షం కురిస్తే వేమూరు, రేపల్లె ప్రాంతాల్లో పంట మొత్తం నేలకొరిగే అవకాశముంది.

అన్నదాతల్లో ఆందోళన

- మరోమారు వర్షం కురిసే పరిస్థితులు నెలకొనడంతో జిల్లా వ్యాప్తంగా వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రేపల్లె వ్యవసాయ డివిజన్‌లో 1,45,766 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేయగా 3,78,998 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటివరకూ ఈ డివిజన్ పరిధిలో వేమూరు నియోజకవర్గంలో మాత్రమే 50 శాతం కోతలు పూర్తికాగా రేపల్లె నియోజకవర్గంలో ఇప్పటివరకు 5 శాతం కోతలు మాత్రమే పూర్తయ్యాయి. మరో వారం రోజుల తర్వాత కానీ మిగిలిన కోతలు మొదలయ్యే అవకాశంలేదు. ఈ లోపు వర్షం కురిస్తే వరిపంట నీటిపాలై రైతులకు తీవ్ర నష్టం వాటిల్లనుంది.
- బాపట్ల డివిజన్ పరిధిలో 51,613 ఎకరాల్లో రైతులు వరిపంట సాగుచేయగా 1,34,194 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశముంది. చాలా వరకు వరి పంట ఈ డివిజన్‌లో పాలు పోసే దశలో ఉంది. ఇప్పుడు వర్షం కురిస్తే వెన్నులోకి నీరు చేరి పాలు నిలిచిపోయి కంకి తాలు పోయే పరిస్థితి ఉంటుంది. అదే జరిగితే పట్టుమని 30 శాతం దిగుబడులు కూడా వచ్చే పరిస్థితి ఉండదు.
- చీరాల డివిజన్‌లో వరిసాగు మరింత ఆలస్యంగా మొదలౌతుంది. ఇప్పటి వరకూ 19,054 ఎకరాల్లో మాత్రమే వరిపంట సాగైంది. ఇప్పుడిప్పుడే వరి నాట్లు మొదలయ్యాయి. ప్రస్తుతం ప్రాంతంలో చిరుజల్లులు కురుస్తున్నాయి. ఇప్పుడు వర్షం కురిస్తే నీటి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో ముందస్తుగా వేసిన కొద్దిపాటి వరి పంటకూ నష్టం వాటిల్లనుంది.
- జిల్లాలో గత ఖరీఫ్‌లో 2,16,434 ఎకరాల్లో రైతులు వరిపంట సాగు చేయగా 5,62,729 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ప్రస్తుతం వర్షం కురిస్తే పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది.

అయినకాడికి అమ్మకం

ఇటీవల కురిసిన వర్షాలకు కోత కోసిన ధాన్యం ఆరబెట్టుకునే పరిస్థితి లేకపోవడంతోపాటు ధాన్యం నిలువ పెట్టుకునే వసతులు లేకపోవడంతో రైతులు కోత కోసిన ధాన్యాన్ని బస్తా రూ.1400 ధరకు మిల్లర్లకు తెగనమ్ముకుంటున్నారు. ప్రభుత్వం బస్తాకు రూ.1740 ఇస్తామని చెబుతూనే తేమ శాతం 17లోపు ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొంటామని తొలుత ప్రకటించింది. ఆ తర్వాత 20 శాతంలోపు తేమ ఉన్నా కొంటామని, అయితే అందుకు 5 కిలోల ధాన్యం అదనంగా ఇవ్వాలని ఆంక్షలు పెట్టింది. దీంతో రైతులు ప్రధానంగా కౌలు రైతులు ధాన్యాన్ని రూ.1400 కే మిల్లర్లకు అమ్ముకున్నారు. వసతులు ఉన్నా కొద్దిమంది రైతులు మాత్రమే ధాన్యం నిలువ పెట్టుకున్నారు.



బాపట్ల ప్రాంతంలో పాలు దశలో ఉన్న వరి

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి



మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జాతీయ ప్రతిభ ఉపకార వేతనాల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సోమవారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆయన సమావేశం నిర్వహించారు. జాతీయ ప్రతిభ ఉపకార వేతనాల పరీక్షలు ఈనెల 8వ తేదీన జిల్లాలో జరుగుతాయని కలెక్టర్ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పది పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. 2,319 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. పదిమంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 10 మంది అధికారులు, 99 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రాథమిక వైద్యం అందించడానికి 20మంది ఏఎన్‌ఎంలను నియమించామన్నారు. పరీక్షలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ బస్సులు నడపాలని, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయించాలన్నారు. పోలీసుల బందోబస్తు నిర్వహించాలని సూచించారు. పరీక్షలు సమర్థంగా నిర్వహించడానికి అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్, డీఈవో పురుషోత్తం, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సైనికుల కుటుంబాలకు సహాయం చేద్దాం



బాపట్ల: దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికుల కుటుంబాల సహాయార్థం విరాళాల సేకరణలో జిల్లా అధికారులందరూ సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్ తెలిపారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి సంబంధించి రూపొందించిన పోస్టర్‌లను సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. సైనికుల కుటుంబాల సహాయార్థం విరాళాల సేకరణలో అధికారులు సహకరించాలని కోరారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ రూపొందించిన స్టిక్కర్లను జిల్లా అధికారులు అందరూ వారి సిబ్బందిచే కొనుగోలు చేయించాలన్నారు. అధిక మొత్తంలో విరాళాలు సేకరించడం ద్వారా సైనిక కుటుంబాలను ఆదుకోవచ్చన్నారు. ఆ నిధిని జిల్లా సైనిక సంక్షేమ శాఖ వారికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆపరేటివ్ అధికారి శ్యాంసన్, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామక పరీక్షలు వాయిదా

రేపల్లె రూరల్: రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 46 రేషన్ డీలర్లు, 3 బై ఫరగేషన్ దుకాణాల భర్తీ కోసం నిర్వహిస్తున్న పరీక్షలను వాయిదా వేసినట్లు ఆర్డీఓ నేలపు రామలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 2వ తేదీన జరగాల్సిన పరీక్షలను 9వ తేదీకి, 5వ తేదీన జరగాల్సిన ఇంటర్వ్యూలు 12వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

శిల్పారామం పరిశీలన



గుంటూరు రూరల్: గుంటూరు శిల్పారామాన్ని సోమవారం రాష్ట్ర శిల్పారామాల నూతన సీఈవో వి. స్వామినాయుడు, నూతన చైర్‌పర్సన్ చెరెడ్డి మంజుల రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ, ఫీల్డ్ సిబ్బందితో సీఈవో మాట్లాడారు. శిల్పారామం మొత్తం తిరిగారు. స్టాల్స్, బోటింగ్ పాండ్, గార్డెన్ పరిశీలించారు. బోటింగ్ పాండ్ ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల పుస్తకాన్ని సందర్శకులకు అందుబాటులో ఉంచాలని, వారంతపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో శిల్పారామం ఏవో శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నాగార్జున, డీఈవో భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

పాడ్యమి పూజలతో ముగిసిన కార్తిక మాసం

అమరావతి: ప్రథమారామం అమరావతి క్షేత్రంలోని శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి అలయంలో సోమవారం కార్తికమాసం చివరిరోజు భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. కార్తిక అమావాస్య అనంతరం పాడ్యమి పర్వదినాన ఆలయాన్ని సందర్శించిన భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద దీపాలను వెలిగించారు. నదిలో దీపాలను వదిలి పోలిని స్వర్గానికి పంపే కార్యక్రమం నిర్వహించారు. అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరీ అమ్మవారికి పూజలు చేశారు. కార్తిక మాసం ఆఖరిరోజు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమరేశ్వరాలయాన్ని సందర్శించారు. ఆలయ ఈవో సునీల్‌కుమార్ భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ధనుర్మాస ప్రచార వాహనాలు ప్రారంభం



తాడేపల్లిరూరల్: ధనుర్మాసం ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ప్రచార వాహనాలను త్రిదండి చిన్నజీయర్‌స్వామి సోమవారం ప్రారంభించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ విజయకీలాద్రి దివ్యక్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్ దేవదాయ కమిషనర్ ఎస్. సత్యనారాయణ సోమవారం దర్శించారన్నారు. ఆయనకు చిన్నజీయర్‌స్వామి తీర్థప్రసాదాలతో పాటు మంగళాశాసనం అందజేశారని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారం వేగవంతం చేయండి



జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు అర్జీ ఇస్తున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు జోగి రాజా

జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్


బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధికారులు ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూ ఆక్రమణలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిశీలించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. భూ ఆక్రమణలపై మండల స్థాయిలో అధికారులు ప్రతి గురువారం ప్రజలు అర్జీలు తీసుకొని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, జిల్లా సహకార శాఖ అధికారి శ్యాంసన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జన్నెమ్మ, మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు వివరాలపై విచారణ చేపట్టాలి

విజయవాడ వరదల సమయంలో బాపట్ల మున్సిపాల్టీ నుంచి ఖర్చు పెట్టిన వాటి వివరాలపై విచారణ చేపట్టాలి. సాధారణ నిధులు రూ.40లక్షలు ఖర్చు పెట్టినట్లు చూపిన అధికారులు వాటి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచటంలో కారణాలపై విచారణ చేపట్టాలి.

–జోగి రాజా, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు


వరద బాధితులను ఆదుకోలేదు



కృష్ణానదికి వరద వచ్చినప్పుడు తాము తీవ్రంగా నష్టపోయాం. మా గురించి పట్టించుకున్నవారేలేరు. వరద బాధితుల పేరుతో కొంతమంది వచ్చి సాయం పొందారే గానీ, వాస్తవంగా నష్టపోయిన వారికి సాయం అందలేదు. వరద బాధితులకు కనీసం రూ.10వేలు సాయం అందించి ఆదుకోవాలి.

–కిష్కింధపాలెం గ్రామస్తులు

సొసైటీ భూములను కాపాడాలి



కొల్లూరు మండలం పోతార్లంక గ్రామ రెవెన్యూ పరిధిలోని రావిలంక గ్రామంలోని సర్వే నెంబరు 310లోని 318 ఎకరాల్లో భూమిని కొంతమంది ఆక్రమించారు. చెట్లు నరికి, ట్రాక్టర్లతో దుక్కి దున్ని ఇష్టమొచ్చినట్లు చేస్తున్నారు. ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి.

–మోహనరావు, సర్పంచ్

సీఎం పర్యటనకు

ఏర్పాట్లు పూర్తి చేయండి




సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్

రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్

బాపట్ల: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజు, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కలసి బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలను సోమవారం పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్ల సమావేశం నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి హాజరయ్యే సమావేశానికి ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల ప్రగతి పత్రాలపైన, తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల చర్చా కార్యక్రమంపై సమీక్షించారు. పాఠశాల ఆవరణలో రంగవల్లులు, పోటీలు నిర్వహించే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా తరగతి గదులను పరిశీలించారు. తల్లిదండ్రుల సమావేశంలో ముఖ్యమంత్రి ఎక్కడెక్కడ పాల్గొంటారో చర్చించారు. విద్యార్థులతో చర్చించే ప్రాంతం, భోజనం చేసే ప్రాంతం, పరిశీలించే పాఠశాల భవనం తరగతి గదులను చూశారు. ముఖ్యమంత్రి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల హాజరయ్యే సమావేశంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని శశిధర్ అన్నారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులను మాత్రమే పాఠశాలలోకి అనుమతించాలన్నారు. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యాబోధన జరుగుతుండగా 919 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. వారి తల్లిదండ్రులందరిని పిలిపించాలన్నారు. మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు సిద్ధం చేయాలన్నారు. అధికారులు మరింత పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రుల సమావేశానికి ఆహ్వాన పత్రికలను విద్యార్థులే సిద్ధం చేస్తున్నారని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి తెలిపారు. సృజనాత్మకతతో విద్యార్థులు తయారు చేసిన ఆహ్వాన పత్రికలను సచివాలయాల సిబ్బంది తల్లిదండ్రులకు అందజేస్తారని చెప్పారు. విద్యార్థులతో రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం జయప్రదం చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాట్లను ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆయన వివరించారు. పోలీస్ కవాతు మైదానంలో హెలిప్యాడ్ సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, బుడా చైర్మన్ రాజశేఖర్‌బాబు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

బాపట్లటౌన్: సీఎం చంద్రబాబు పర్యటన ముగిసేంతవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. సీఎం జిల్లా పర్యటనలో తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లను సోమవారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. తొలుత పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో హెలిపాడ్ ఏర్పాటు చేసే ప్రదేశాన్ని, బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను, నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాన్ని, చుట్టుపక్కల ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతాపరంగా పోలీస్ అధికారులు తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు వచ్చి వెళ్లడానికి అనుకూలంగా ప్రవేశ మార్గాలపై పోలీసు అధికారులతో చర్చించారు. పాఠశాలలో తల్లిదండ్రులతో ఎక్కడ సమావేశం నిర్వహిస్తారు, విద్యార్థులతో చర్చించే ప్రదేశం, భోజనం చేసే ప్రాంతం, పాఠశాల భవనం తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

జోరు వర్షంలోనూ యానిమేటర్ల ఆందోళన


- ఆరునెలలుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- హైకోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తున్న అధికారులు
- హైకోర్టు ఉత్తర్వులతో పీడీ కార్యాలయం ముందు ఆందోళన



కార్యాలయం ముందు బైటాయించిన యానిమేటర్లు

బాపట్లటౌన్: ఏళ్ల తరబడి ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్న మమ్ములను ఏ కారణంతో విధుల నుంచి తొలగించారో చెప్పాలంటూ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత విధుల నుంచి తొలగించిన యానిమేటర్లు సోమవారం జిల్లా పీడీ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. అధికారులు పట్టించుకోకపోవడంతో రెండు నెలల కిందట జిల్లాలోని సుమారు 50 మంది యానిమేటర్లకు పైగా తమకు న్యాయం చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. తొలగించిన వారిని యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. క్షేత్రస్థాయిలోని అధికారులకు హైకోర్టు ఉత్తర్వులను అందజేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఆగ్రహించిన యానిమేటర్లు జిల్లా నలుమూలల నుంచి సోమవారం జిల్లా పీడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పీడీ కార్యాలయం ముందే బైటాయించారు. సిబ్బంది పట్టించుకోకపోవడంతో వర్షంలోనే పీడీ కార్యాలయం ముందు చెట్ల క్రింద, హౌసింగ్ కార్యాలయం వరండాలో సేదతీరారు.

20 ఏళ్లుగా పనిచేస్తున్నా



నేను మోళ్లగుంట గ్రామంలో 20 ఏళ్లుగా యానిమేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. యానిమేటర్‌గా విధుల్లో చేరేటప్పుడు కేవలం నాలుగు గ్రూపులు ఉండేవి. ప్రస్తుతం 40 గ్రూపులు ఉన్నాయి. 40 గ్రూపుల్లో 400 మంది సభ్యులు ఉన్నారు. వారిలో ఏ ఒక్కరూ నన్ను తొలగించమని చెప్పలేదు. నేను అవసరం లేదని గ్రామైఖ్య సంఘం తీర్మానం కూడా చేయలేదు. మా ప్రాంతంలోని టీడీపీ నాయకుడు భార్య లంకె వరలక్ష్మిని నియమించేందుకు నన్ను తొలగించారు.

– సీహెచ్ విజయకుమారి, మోళ్లగుంట, రేపల్లె మండలం

తొలగించిన విషయం ఫోన్‌లో చెప్పారు



నేను ఐలవరం గ్రామంలో యానిమేటర్‌గా ఏళ్ల తరబడి విధులు నిర్వర్తిస్తున్నాను. నాపై రాజకీయ ముద్ర వేసి నన్ను విధుల నుంచి తొలగించారు. తొలగించిన విషయం కూడా నాకు మా గ్రామానికి చెందిన ఏ ఒక్కరూ చెప్పలేదు. జులై 31న సాయంత్రం ఏపీఎం ఫోన్‌చేసి రేపటి నుంచి నీవు విధుల నుంచి తప్పుకో నీ స్థానంలో చిలుకోటి కోటేశ్వరిని నియమించాం అన్నారు. ఇదేంటి సార్ అని అడిగితే మీ పరిధిలోని టీడీపీ నాయకులతో మాట్లాడుకోమంటూ ఫోన్ పెట్టాశారు.

–మాచర్ల సుజాత, ఐలవరం, భట్టిప్రోలు మండలం

క్లుప్తంగా

కారు ఢీకొని వ్యక్తి మృతి

చీరాల: ప్రమాదవశాత్తూ కారు టైరు తలపైకి ఎక్కడడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలో చోటుచేసుకుంది. ఈపూరుపాలెం రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కొణిజేటి చేనేతపురికి చెందిన సత్యనారాయణ (55) బయట పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఈపూరుపాలెం శివాలయం వద్ద రోడ్డుపై నిద్రించగా అటుగా వెళ్తున్న కారు చీకటిలో రోడ్డుపై నిద్రిస్తున్న వ్యక్తి కనిపించకపోవడంతో టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.

సైడు కాలువలో మృతదేహం లభ్యం



అద్దంకి రూరల్: సైడు కాలువలో పడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై ఖాదర్‌బాషా వివరాల మేరకు.. పట్టణంలోని కలవకూరురోడ్డు నవత ట్రాన్స్‌పోర్టు ఆఫీస్ పక్కన ఉన్న మురికి కాలువలో మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు సోమవారం మధ్యాహ్నం 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి కాలువలో నుంచి తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఎస్సైకు సమాచారం ఇవ్వటంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వివరాలు సేకరించారు. మృతుడు జే.పంగులూరు మండలం రామకూరు గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన బత్తుల ఆనంద్ (44)గా గుర్తించారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

కనువిందు చేస్తున్న సాలె గూళ్లు







మంచు కురిసే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో తీగలు..ముళ్ల కంచెలను పెనవేసుకున్న సాలె పురుగులు ఏర్పాటుచేసిన గూళ్లు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పాదచారులు వాటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

-బాపట్లటౌన్

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రేమ్‌సాగర్‌కు కాంస్యం



కాంస్య పతకం సాధించిన ప్రేమ్‌సాగర్

చీరాల రూరల్: జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బాపట్ల జిల్లా చీరాలకు చెందిన దేవరకొండ ప్రేమ్‌సాగర్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి కాంస్య పతకం సాధించాడు. నవంబర్ 26 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జాతీయస్థాయి సౌత్-వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ మెన్ అండ్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చీరాల సాయికాలనీకి చెందిన ప్రస్తుతం వైఎస్సార్ కడప యోగివేమన విశ్వవిద్యాలయంలో డిగ్రీ విద్యనభ్యసిస్తున్న దేవరకొండ ప్రేమ్‌సాగర్ 81 కిలోల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నాడు. ఎంతో అద్భుత ప్రదర్శన కనబరచిన ప్రేమ్‌సాగర్ స్నాచ్‌లో 134 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 163 కేజీలు ఓవరాల్‌గా 297 కేజీల బరువులు ఎత్తి తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం అందుకున్నాడు. దేశంలోని 13 రాష్ట్రాల నుంచి 125 విశ్వవిద్యాలయాలు పాల్గొనగా వారిలో ప్రేమ్‌సాగర్ తృతీయ స్థానం సాధించి మన రాష్ట్రంతో పాటు చీరాల కీర్తి ప్రతిష్టను ఇనుమడింపచేశాడు. ప్రేమ్‌సాగర్ సాక్షితో మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తన తల్లిదండ్రులు గొప్ప వెయిట్ లిఫ్టర్‌గా చూడాలన్నదే వారి జీవిత ఆశయంగా చెప్పారు. జాతీయస్థాయిలో పతకం సాధించిన ప్రేమ్‌సాగర్‌కు ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరి, కోచ్ దీన్నాబాబు, వైస్ ప్రసిడెంట్ బడేటి వెంకట రామయ్య, విశ్వవిద్యాలయం స్పోర్ట్స్‌బోర్డ్ హెడ్ డాక్టర్ కొవ్వూరు రామసుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు. తన ప్రతిభపై విశ్వాసంతో తనకు స్పాన్సర్‌షిప్ అందిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, దగ్గుమళ్ల రాధే గ్రూప్‌కి ప్రేమ్‌సాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

సబ్ జూనియర్స్ విజేత ప్రకాశం జిల్లా ఎడ్ల జత



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న ఎడ్ల పోటీలలో భాగంగా సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో పోటీలు జరిగాయి. పోటీలను మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, చప్పిడి రాము తదితరులు ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పాడు మండలం, మద్దిరాల ముప్పాళ్లకు చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్ల జత బండను 2,600 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకుంది. గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యల్లం సాంబశివరావు ఎడ్ల జత 1,800 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానాన్ని హైదరాబాదుకు చెందిన డి రోషన్‌బాబు ఎడ్ల జత 1,683 అడుగుల దూరం లాగి తృతీయ స్థానాన్ని కైవశం చేసుకున్నాయి. విజేతలకు నగదు బహుమతులను గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ బాణావతు సరస్వతీబాయిబాలనాయక్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజనేయులు, మాజీ ఎంపీపీ రామావతు నాగులునాయక్, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, కంభంపాటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గుండా బ్రహ్మయ్య, సంగినీడి బాలకృష్ణలు అందించారు. కార్యక్రమంలో కారెంపూడి రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి తెనాలి మారిస్‌పేట మొండి గోడల వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఒంటిపై చొక్కా లేదు. యాచకుడై ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నారు. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలోత్సవ్ జయప్రదం చేయాలి

శావల్యాపురం: బాలోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని జిల్లా బాలోత్సవ అధ్యక్షులు సీహెచ్.రాజారెడ్డి చెప్పారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఈనెల 28,29 తేదీల్లో జరగనున్న నరసరావుపేట పీఎన్‌సీఅండ్‌కేఆర్ ప్రాంగణంలో బాలోత్సవ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. బాలోత్సవ్‌కు 20 వేల మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు. పోస్టర్ ఆవిష్కరించిన వారిలో బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, బెజవాడ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

తపాలా శాఖలో ఉద్యోగాల పేరుతో మోసపోవద్దు

లక్ష్మీపురం: గ్రామీణ ప్రాంతాల పోస్టాఫీసుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని కొంతకాలంగా విధులకు హాజరుకాకుండా ఉన్న గుంటూరు హెడ్ పోస్టాఫీస్‌లో పనిచేస్తున్న పోస్ట్‌మేన్ నాగార్జున మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని గుంటూరు పోస్టల్ డివిజనల్ సూపరిటెండెంట్ యలమందయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు అతడి మాటలు నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం వెబ్‌సైట్ ద్వారా నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు మాత్రమే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు ఆపేశారు. బ్యాంక్ కెనాల్‌కు 244 , తూర్పు కెనాల్‌కు 41, పశ్చిమ కెనాల్‌కు 56, నిజాంపట్నం కాలువకు 240, కొమ్మమూరు కాలువకు 1110 క్యూసెక్కులు విడుదల చేశారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



చెరువులో నుంచి అగ్నిమాపక సిబ్బంది వెలికితీసిన జస్వంత్ మృతదేహం

పర్చూరు (చినగంజాం): చెరువులో మునిగి గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యమైంది. పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. గ్రామానికి చెందిన పాలేరు శ్రీనివాసరావు, కోకిల దంపతుల చిన్నకుమారుడు పాలేరు జస్వంత్(17) ఆదివారం సాయంత్రం కొద్దిసేపు ఆటలాడుకున్న తరువాత తన తోటి స్నేహితులతో ఇద్దరితో కలిసి చెరువులో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఆ సమయంలో జస్వంత్ తాను ఈత నేర్చుకునే ప్రయత్నంలో నీటిలో మునిగి పోకుండా ఉండేందుకు తన నడుముకు రెండు లీటర్ల ప్లాస్టిక్ ఖాళీ డబ్బాలు కట్టుకొని నీటిలో దిగాడు. నీటిలో ఈత కొట్టే సమయంలో అతని నడుముకున్న డబ్బాలు ఊడిపోవడంతో జస్వంత్ నీటిలో మునిగిపోయినట్లు అతని స్నేహితులు తెలిపారు. ఇద్దరు స్నేహితులు ఆ సమయంలో ఒడ్డుకు చేరుకొని పెద్దగా కేకలు వేశారు. కేకలు విని గ్రామస్తులు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు జస్వంత్ కోసం చెరువులో గాలింపు చర్యలు చేపట్టి ఫలితం లేకపోవడంతో చీరాల నుంచి అగ్నిమాపక సిబ్బందిని రంగంలోకి దింపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలు నుంచి రాత్రి 10 గంటల వరకు గాలించినా ఫలితం లేకపోవడంతో రెవెన్యూ అధికారులు జాతీయ విపత్తు నిర్వహణ శాఖకు సమాచారం అందించారు. వారువచ్చేలోగా అగ్నిమాపక సిబ్బంది సోమవారం ఉదయం గాలించి యువకుడు మృతదేహాన్ని బయటకు తీశారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. యువకుని తల్లిదండ్రులు, బంధువులు బోరును విలపిస్తున్నారు. చీరాల భారతి డిగ్రీ కళాశాలలో జస్వంత్ డిగ్రీ చదువుతుండగా అతని అన్న యశ్వంత్ డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు.

పట్టువదలని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

శిబిరం ఏర్పాటు చేసుకుని ఆందోళనలు కొనసాగింపు



కార్మికులు తిరిగి నిర్మించుకున్న దీక్షా శిబిరం

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు పట్టువదలకుండా దీక్షను కొనసాగిస్తున్నారు. శిబిరాన్ని కూల్చివేసినా తిరిగి నిర్మించుకున్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. పోరాట శిబిరాన్ని కూల్చివేసినా తిరిగి కార్మికులంతా ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని సీఐటీయూ తాడేపల్లి కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. సోమవారం ఆయన పోరాట శిబిరాన్ని సందర్శించి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. అధికారులు కనీస నిబంధనలను కూడా పాటించకుండా 200 గుడిసెలను అక్రమంగా కూలగొట్టడం అన్యాయమని ఖండించారు. ఏఐటీయూఎఫ్ నాయకులు కోటయ్య మాట్లాడుతూ కార్మికుల పట్టుదలను దెబ్బతీయడం కోసం ప్రభుత్వమే ఇళ్లను కూల్చివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పోరాటానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కె. స్టీవెన్, బి.అంకయ్య, బి.సూర్యప్రకాష్, ఎం.ఆశీర్వాదం, వై.యెహోషువా, కె.ఆదినారాయణ, రమాదేవి, ఎం.శారద, సామ్రాజ్యం, ఎం.గురవయ్య, సాంబశివరావు, సుబ్బారావు, యస్‌కె.ఆరిఫ్, సీపీఎం నాయకులు ఎం. పకీరయ్య పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు

ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



రోడ్డు మరమ్మత్తుపనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

నరసరావుపేట రూరల్: ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్రంలోని రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుదని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెట్లూరివారిపాలెం- కోటప్పకొండ రహదారిలో చేపడుతున్న రహదారి మరమ్మతు పనులను మంత్రి జనార్దన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. కోటప్పకొండకు చేరుకున్న మంత్రికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న రోడ్లు మరమ్మతు పనులపై ఆర్‌అండ్‌బీ ఈఈ రాజానాయక్‌తో మంత్రి సమీక్షించారు. అనంతరం కోటప్పకొండ రోడ్లు మరమ్మతు పనులను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. పల్నాడు జిల్లాలో 1737 కిలో మీటర్ల విస్తీర్ణంలో రహదారులు ఉండగా 383 కిలో మీటర్ల మేర దెబ్బతిన్నాయని చెప్పారు. ఇందులో ప్రధాన రహదారులు 1048 కిలోమీటర్లు కాగా, పంచాయతీరాజ్ శాఖ నుంచి 306 కిలోమీటర్ల రోడ్లను ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించారని తెలిపారు. రాజుపాలెం-బెల్లంకొండ రోడ్డును డబుల్ రోడ్డుగా మారుస్తున్నట్టు తెలిపారు. నాబార్డు నిధులతో రూ.142 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించినట్టు తెలిపారు. కృష్ణానదిపై మాదిపాడు వద్ద రూ.60.54 కోట్లతో నాబార్డు నిధులతో చేపట్టనున్న బ్రిడ్జి పనులకు టెండర్ ప్రక్రియ పూర్తిచేసినట్టు వివరించారు. జిల్లాలో 935 కిలోమీటర్ల రోడ్లకు రూ.38కోట్లతో 133 మరమ్మతు పనులను చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీవో మధులత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ లిఫ్టర్‌కు కాంస్య పతకం

96 కేజీల కేటగిరీలో ప్రతిభ కనబరిచిన అరునేష్ బాబు



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్, వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో భాగంగా సోమవారం పలు కేటగిరీలో పోటీలు జరిగాయి. వివరాలను పోటీల నిర్వాహక కార్యదర్శి, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పి.పి.ఎస్. పాల్ కుమార్ వెల్లడించారు.

- 96 కేజీల కేటగిరిలో మధురై కామరాజ్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టర్ అఫ్రీన్ మొత్తం 300 కేజీల బరువులు ఎత్తి బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. తిరువల్లువార్ యూనివర్సిటీ లిఫ్టర్ జె. దీర్షన్ 298 కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. నాగార్జున యూనివర్సిటీ లిఫ్టర్ ఏ. అరునేష్ బాబు 297 కేజీల బరువులెత్తి కాంస్య పతకం సాధించాడు.
- 102 కేజీల విభాగంలో సావిత్రీబాయి పూలే యూనివర్సిటీ లిఫ్టర్ వైష్ణవ్ సాహసి ఠాకూర్ మొత్తం 321 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. . బెంగళూరు సిటీ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టర్ ఫాజిల్ రెహ్మాన్ 311 కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని గెలుచుకున్నాడు. కొలహపూర్‌లోని శివాజీ యూనివర్సిటీ లిఫ్టర్ రాజేంద్ర 306 కేజీల బరువులెత్తి కాంస్య పతకం సాధించాడు. పోటీలు మంగళవారంతో ముగుస్తాయని ప్రొఫెసర్ పాల్ కుమార్ తెలిపారు.

బాలిక హత్య కేసు ఛేదించిన పోలీసులు

- నాలుగు నెలలు తర్వాత గ్యాస్ డెలివరీ బాయ్ అరెస్ట్
- క్లూ లభించకుండా నిందితుడు పలు రాష్ట్రాల్లో సంచారం
- సాంకేతిక పరిజ్ఞానంతో ఆచూకీ గుర్తింపు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: బాలిక హత్య కేసులో చిక్కుముడి వీడింది. ఈ ఘటనలో గ్యాస్ డెలివరీ బాయ్‌ని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో ఈ ఏడాది జూలై 15న కుమార్తె హత్యకు గురైనట్లు తండ్రి చేబ్రోలు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. హత్య ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు తెనాలి డీఎస్పీ జనార్దన్‌రావు, పొన్నూరు రూరల్ పీఎస్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు పీఎస్ ఎస్ఐ డి.వెంకటకృష్ణతోపాటు సీసీఎస్, ఎనిమిది బృందాలతో నిందితుడి ఆచూకీ కోసం జల్లెడ పట్టారు. అప్పటి నుంచి అతడు ఎటువంటి ఆధారాల్లేకుండా నాలుగు నెలలకు పైగా కానరాలేదు. ఏపీతోపాటు, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలోనూ గాలించారు. సీసీటీవీ ఫుటేజ్, లైవ్ ట్రాకింగ్, సామాజిక మాధ్యమాలు, సాంకేతిక ఆధారాలు, వ్యక్తుల సమాచారంతో గుంటూరు, విజయవాడ, హన్మకొండ, హైదరాబాద్, విశాఖపట్నం, నర్సీపట్నం, తిరుపతి పరిసర ప్రాంతాల్లోనూ గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ కేసుపై పదిహేను రోజులకు ఒకసారి పోలీస్ బృందాలతో సమీక్ష నిర్వహించారు.

పలుచోట్ల బస

బాలికను హత్య చేసిన నాగరాజు గుంటూరు నుంచి బస్‌లో తొలుత విజయవాడ వెళ్లాడు. అక్కడ్నుంచి రైల్లో హన్మకొండలో దిగి అక్కడ బస చేశాడు. అనంతరం హైదరాబాద్, విశాఖపట్నం, పిఠాపురం, రాజమండ్రి, తిరుపతి, తమిళనాడులోని తిరువూరు స్పిన్నింగ్ మిల్లుల్లో పనిచేసి, రాజమండ్రి చేరాడు. అక్కడ స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్న నాగరాజుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, బాలిక తల్లితో అతనికి వివాహేతర సంబంధం ఉండేది. వారి మధ్య విబేధాలు వచ్చాయి. ఈ క్రమంలో తల్లిపై కోపంతో బాలికను హత్య చేశాడు. నాలుగు నెలలకు పైగా ఎటువంటి ఆధారాల్లేకుండా తిరుగుతున్న నాగరాజుని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన తెనాలి డీఎస్పీ జనార్దన్‌రావు, పొన్నూరు రూరల్ పీఎస్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు పీఎస్ ఎస్ఐ డి.వెంకటకృష్ణ, సీసీఎస్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. సీఐ వై.కోటేశ్వరరావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ అభిలాష్‌కు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా

నిందితుడు స్పిన్నింగ్ మిల్, గ్యాస్ గోదాంలో పనిచేసేవాడని తెలియడంతో ఆయా ప్రదేశాల్లోనూ వెదికారు. కేసును ఛేదించేందుకు సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పలు ప్రాంతాల్లోనూ నిఘా ఉంచారు. గతంలో ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో రజనీని గొంతు నులిమి హత్య చేయగా, అప్పట్లో పనులు చేసుకుంటూ కర్ణాటకలోని గుల్బర్గా, మహారాష్ట్రలోని సోలాపూర్‌లో మకాం వేశాడని తెలిసి, అక్కడ గాలించారు. ఈ క్రమంలో రాజమండ్రిలోని ఓ స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్నాడనే సమాచారంతో పొన్నూరు రూరల్ పీఎస్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు పీఎస్ ఎస్ఐ డి.వెంకటకృష్ణ సిబ్బందితో వెళ్లి కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం, కొండపల్లి గ్రామవాసి ఎస్.నాగరాజుని అరెస్ట్ చేశారు. అతను చేబ్రోలు లోని కొత్తరెడ్డిపాలెంలో అద్దెకు ఉంటూ, ఒక గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పని చేసేవాడు.

పేకాట, కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

- 8 బైకులు, 9 సెల్‌ఫోన్లు, రూ.1.03 లక్షలు స్వాధీనం
- 8 మందిపై కేసు నమోదు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని రవ్వారం కొండ వెనుక డంపింగ్ యార్డులో సాయంత్రం 5 గంటల సమయంలో పేకాట, కోడిపందేలు నిర్వహిస్తున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.లక్ష 3 వేల 500 నగదు, 8 బైక్‌లు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు సోమవారం తెలిపారు. ఐనవోలు పోలీసు స్టేషనులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐతో పాటు ఎస్ఐ కృష్ణారావు,ఎస్‌బీ పోలీసు అధికారి మస్తాన్‌వలీ, రైటరు విల్సన్ తదితరులు పాల్గొన్నారు.